సాక్షి
నిర్మల్
సోమవారం । 30 । అక్టోబర్ । 2023



ఓటేయనివారు 3,48,736

గత అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 3,48,736 మంది పోలింగ్‌కు దూరంగా ఉన్నారు. ఈసారి పోలింగ్‌శాతం పెంచేందుకు ఎన్నికల కమిషన్ ప్రత్యేక చర్యలు చేపడుతోంది.

10లో ▸



గజ్జలమ్మ దేవికి పూజలు

కుంటాల: మండల కేంద్రంలో ఆదివారం గజ్జలమ్మ, ముత్యాలమ్మ, మహాలక్ష్మీ ఆలయాల్లో గురుస్వామి గజేందర్ ఆధ్వర్యంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. భక్తులు నైవేద్యం సమర్పించి మొక్కు తీర్చుకున్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.0 /25.0

సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. వాతావరణం పొడిగా ఉంటుంది. చలి ప్రభావం కాస్త తగ్గుతుంది. రాత్రివేళ మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

చారిత్రక సదస్సులో జిల్లావాసి



పరిశోధన పత్రం అందజేస్తున్న పీజీ రెడ్డి

నిర్మల్ ఖిల్లా: కేరళలోని తిరువనంతపురంలో నిర్వహిస్తున్న దక్షిణ భారత చారిత్రక సదస్సులో నిర్మల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చరిత్ర అధ్యాపకుడిగా పని చేస్తున్న డాక్టర్ పీజీ రెడ్డి తన పరిశోధన పత్రాన్ని అందించారు. 'ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో గిరిజన, గిరిజనేతరుల దేవాలయ సంస్కృతి' అనే అంశంపై తాను శోధించిన వివరాలను పరిశోధన పత్రంలో పొందుపరిచారు. బాసర సరస్వతీ ఆలయం, కేస్లాపూర్‌లోని గోండు జాతి ఆరాధించే ప్రఖ్యాత నాగోబా ఆలయాల చరిత్ర, సంస్కృతి, వాస్తుకళా నైపుణ్యాల వైభవాన్ని అందులో వివరించారు. ఈ సందర్భంగా పీజీ రెడ్డిని నిర్మల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జే భీమారావు, జిల్లాకు చెందిన చరిత్రకారులు, అధ్యాపకులు అభినందించారు.

సాహితీవేత్తలకు సన్మానం



సన్మాన గ్రహీతలతో గోపాల ఆచార్య

నిర్మల్ ఖిల్లా: 'కలం స్నేహం సాహితీ, సాంస్కృతిక సంస్థ' ఆధ్వర్యంలో యాదాద్రిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి శతాధిక కవి సమ్మేళనంలో జిల్లాకు చెందిన పలువురు సాహితీవేత్తలు, కవయిత్రులను జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు, శాలువాలతో సన్మానించారు. వీరు యాదాద్రి ప్రాశస్త్యంపై విభిన్న కవితలు వినిపించారు. సాహితీరంగంలో వీరు చేస్తున్న సేవలను గుర్తించిన సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రముఖ సినీ రచయిత గోపాల ఆచార్య వీరిని ఘనంగా సన్మానించారు. సన్మాన గ్రహీతల్లో జిల్లాకు చెందిన కొండూరు పోతన్న, కడారి దశరథ్, వేముల శివరాణి, దేవిప్రియ, బట్టు శోభ, వాణిశ్రీ, రాజేశ్వరి, ప్రయాగ గౌతమి, రస్మిత, మమత తదితరులున్నారు. వీరిని జిల్లాకు చెందిన కవులు, కళాకారులు, సాహితీ అభిమానులు అభినందించారు.

బీజేపీకి పెంబి జెడ్పీటీసీ సభ్యురాలి రాజీనామా



మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డితో మాట్లాడుతున్న జానకీబాయి

నిర్మల్: ఖానాపూర్ టికెట్ ఆశించి భంగపడ్డ పెంబి జెడ్పీటీసీ సభ్యురాలు భూక్య జానకీబాయి బీజేపీకి రాజీనామా చేశారు. ఆమె ఆదివారం సాయంత్రం తన రాజీనామా పత్రాన్ని మీడియాకు వెల్లడించారు. స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి పెంబి జెడ్పీటీసీ సభ్యురాలిగా గెలిచానని గుర్తు చేశారు. బీజేపీపై నమ్మకంతో ఆ పార్టీలో చేరి నియోజకవర్గంలోని పల్లెలు, తండాలు, గూడేలన్నీ కలియదిరిగానని తెలిపారు. ప్రతీ ఇంటికి పువ్వు గుర్తును తీసుకెళ్లానని, తనకు పార్టీ టికెట్ ఇవ్వకపోవడం దారుణమన్నారు. అనంతరం జానకీబాయి మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని నిర్మల్‌లోని ఆయన నివాసానికి వెళ్లి కలిశారు. ఒకట్రెండు రోజుల్లో ఆమె బీఆర్‌ఎస్‌లో చేరేందుకు సిద్ధమయ్యారు. ఇదే విషయమై మంత్రితో మాట్లాడారు. వారి వెంట బీఆర్‌ఎస్ నేత పాకాల రాంచందర్, ఖానాపూర్ నియోజకవర్గ నాయకులున్నారు.

కార్మికుల సమస్యలు మేనిఫెస్టోలో చేర్చాలి



మాట్లాడుతున్న నూతన్‌కుమార్

కడెం: అన్ని రాజకీయ పార్టీలు కార్మికుల సమస్యలు ఎన్నికల మేనిఫెస్టోల్లో చేర్చాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు దుర్గం నూతన్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే నియామకాలుంటాయని చెప్పిన సీఎం కేసీఆర్ పదేళ్లలో ఎలాంటి ఉద్యోగాలు కల్పించలేదని ఆరోపించారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పోటాపోటీగా హామీలు మేనిఫెస్టోల్లో చేర్చి కార్మికులను విస్మరించాయని విమర్శించారు. ఆయన వెంట సీపీఎం జిల్లా కార్యదర్శి బొమ్మెన సురేశ్, ఖానాపూర్ ఏరియా కమిటీ కార్యదర్శి డాకూరి తిరుపతి, నర్సయ్య, రమేశ్ తదితరులున్నారు.

తిరుగుబాటు



- ఎమ్మెల్యే అభ్యర్థులకు అసంతృప్తుల సెగ
- ఇప్పటికే పలువురి నేతల రాజీనామా
- రెబల్‌గా పోటీకి మరికొందరి నిర్ణయం
- ముథోల్, ఖానాపూర్‌లో పార్టీల్లో లొల్లి

నిర్మల్: జిల్లాలో పార్టీ టికెట్లు దక్కని నేతల అసంతృప్తి జ్వాలలు రగులుతూనే ఉన్నాయి. ఆయా పార్టీలకు రాజీనామాల రూపంలో వారి సెగ తగులుతూనే ఉంది. ఇంకొంతమంది అదే పార్టీలో ఉంటూ రెబల్‌గా బరిలో ఉంటామని హెచ్చరిస్తున్నారు. ఈసారి ఎన్నికల్లో చాలామంది నేతలు టికెట్ ఆశించి జోరుగా ప్రచారం చేసుకున్నారు. చివరికి దక్కకపోవడంతో పలువురు తీవ్ర అసంతృప్తికి లోనవుతున్నారు. తమకే టికెట్ ఇస్తామని ఇన్నిరోజులు పనిచేయించుకుని ఇప్పుడెందుకు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. తమ అనుచరులతో సమావేశమవుతూ భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకుంటున్నారు. ప్రధానంగా జిల్లాలోని ముథోల్, ఖానాపూర్ నియోజకవర్గాల్లో అది కూడా కాంగ్రెస్, బీజేపీల్లోనే ఈ పరిస్థితి ఉంది.

అన్యాయం చేశారు..

'టికెట్ నీకే ఇస్తాం.. పార్టీ ప్రచారం చేసుకోమని చెప్పారు. తీరా నాకు కాకుండా నిన్నమొన్న పార్టీలో చేరినవారికి ఇచ్చారు. ఇలా ఎందుకు మమ్మల్ని మోసం చేశారు. ఇదే విషయం ముందే చెబితే సమయం, డబ్బు వృథా కావు కదా..? పార్టీ టికెట్లను పైసలకు అమ్ముకున్నారు..' అంటూ ముథోల్ కాంగ్రెస్ టికెట్ ఆశించిన ఎన్‌ఆర్‌ఐ విజయ్‌కుమార్ రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. తనకు టికెట్ ఇస్తామని చెప్పి మోసం చేశారని, త్వరలోనే తన భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానని ఆయన వెల్లడించారు. 'పల్లెపల్లెకు, తండాలు, గూడేలకూ పువ్వు గుర్తును తీసుకెళ్లా. నా పార్టీ నాకు న్యాయం చేస్తుందన్న నమ్మకంతో పనిచేశా. కానీ.. తీరని అన్యాయం చేశారు. ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో ఒక్క ఆడబిడ్డకు కూడా టికెట్ ఇవ్వలేదు..' అంటూ పెంబి జెడ్పీటీసీ సభ్యురాలు, ఖానాపూర్ బీజేపీ టికెట్ ఆశించిన జానకీబాయి వాపోయారు. తనకు జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ ఆదివారం సాయంత్రం ఆమె బీజేపీకి రాజీనామా చేశారు. త్వరలో ఆమె బీఆర్‌ఎస్‌లో చేరేందుకు సిద్ధమవుతున్నట్లు అనుచరులు పేర్కొన్నారు. ఇలా ఇప్పటికే బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రమాదేవి కూడా పార్టీని వీడి, బీఆర్‌ఎస్‌లో చేరేందుకు సిద్ధమయ్యారు.

ఇంకా ఆశలు..

'టికెట్ ఇస్తామని మాటివ్వడంతోనే కాంగ్రెస్‌లో చేరి పార్టీ కోసం కష్టపడుతున్నాం. చివరి వరకు నాకే టికెట్ అని చెప్పారు. చివరి నిమిషంలో పార్టీలో చేరిన వారికి ఇచ్చారు. ఇది ఏమాత్రం కరెక్ట్ కాదు. అయినా కాంగ్రెస్ ప్రకటించిన రెండో జాబితాలో ముథోల్, బోథ్ రెండు నియోజకవర్గాల్లో అభ్యర్థుల మార్పు ఉండే అవకాశం ఉంది. ఒకట్రెండు రోజులు వేచి చూసిన తర్వాత భవిష్యత్ నిర్ణయం తీసుకుంటాం. అవసరమైతే రెబల్‌గా పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నా..' అని ముథోల్ కాంగ్రెస్ టికెట్ ఆశించిన డాక్టర్ కిరణ్‌కొమ్రెవార్ ఇంకా పార్టీపై ఆశలు పెట్టుకున్నారు. ముథోల్‌లో ఎలాంటి ప్రచారం చేయని, ఎక్కడా కనిపించని మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్‌కు చివరి నిమిషంలో టికెట్ ఇవ్వడంపై పార్టీశ్రేణులే విస్మయం వ్యక్తంచేస్తున్నాయి. పలువురు నేతలు పార్టీ తీరుపై బహిరంగంగానే విమర్శలు చేస్తున్నారు. ముథోల్ నియోజకవర్గం నుంచే బీజేపీ టికెట్ ఆశించి భంగపడ్డ మోహన్‌రావుపటేల్ మాత్రం సైలెంట్ అయ్యారు. పార్టీ టికెట్ ఇచ్చిన రామారావుపటేల్‌కు మద్దతు తెలుపుతూ తన క్యాడర్‌ను పంపించారు.

నిరాశలో నేతలు..

'ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు..' అన్న తరహాలో చాలామంది నేతలు ఈసారి ఎన్నికల్లో టికెట్‌కోసం తీవ్రంగా ప్రయత్నించారు. ఖానాపూర్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిత్వం కోసం సీనియర్‌నేత భరత్‌చౌహాన్ సీరియస్‌గా ప్రయత్నం చేశారు. గల్లీల్లో ప్రచారం చేసుకుంటూనే, ఢిల్లీదాకా వెళ్లి నేతలను కలిసివచ్చారు. కానీ.. చివరికి పార్టీ ఆయనకు కాకుండా జూనియర్‌గా 2021లో పార్టీలో చేరిన వెడ్మ బొజ్జుకు టికెట్ ఇచ్చింది. దీంతో భరత్‌చౌహాన్ తీవ్ర నిరాశకు గురయ్యారు. తన అనుచరులతో సంప్రదింపులు జరుపుతున్నారు. ఇలాగే వినోద్‌నాయక్, రాంకిషన్ నాయక్, చారులత రాథోడ్ తదితరులూ ఈసారి కాంగ్రెస్ ఖానాపూర్ టికెట్ ఆశించి భంగపడ్డారు.

బీజేపీలో చేరిన మాజీ ఎమ్మెల్యే 'నల్ల'



ఇంద్రకరణ్‌రెడ్డిని ఆహ్వానిస్తున్న కిషన్‌రెడ్డి, ఏలేటి

నిర్మల్: నిర్మల్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్‌కు శనివారం రాజీనామా చేసిన నల్ల ఇంద్రకరణ్‌రెడ్డి బీజేపీలో చేరారు. నిర్మల్ అభ్యర్థి ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి సమక్షంలో కాషాయ కండువా వేసుకున్నారు. ఆయనతో పాటు బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు, జెడ్పీటీసీ మాజీ సభ్యులు, మాజీ ఎంపీపీలు ఫణిందర్‌రావు, సుదర్శన్‌గౌడ్, రవీందర్ గౌడ్, చక్రపాణి, ఏఎంసీ మాజీ చైర్మన్ ఆనంద్, సీనియర్ నేతలు చెనిగారపు చిన్నయ్య, కే రాజేశ్వర్, ఎస్. విద్యాసాగర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, గంగయ్య తదితరులు బీజేపీలో చేరారు. ఈసందర్భంగా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. నిర్మల్ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి మహేశ్వర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కాగా, మహేశ్వర్‌రెడ్డి విజయానికి తమవంతు కృషిచేస్తామని నల్ల ఇంద్రకరణ్‌రెడ్డి పేర్కొన్నారు.

'అక్రమ కేసులు ఎత్తివేయాలి'

భైంసాటౌన్: హిందూవాహిని కార్యకర్తలపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని ముథోల్ బీజేపీ అభ్యర్థి పవార్ రామారావుపటేల్ కోరారు. ఈ మేరకు ఆదివారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సీఐని కలిసి విన్నవించారు. ఆయన వెంట రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవిపాండే, నారాయణ్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు మల్లేశ్వర్ తదితరులున్నారు.

సాయుధ 'బలగం'.. రక్షణ కవచం

- జిల్లాలో ప్రత్యేక బలగాల కవాతు
- ఎన్నికల నేపథ్యంలో ముందస్తు మోహరింపు
- విధుల్లో భాగంగా పోలీస్‌శాఖ ప్రత్యేక దృష్టి



సారంగాపూర్: సాయుధ బలగాలతో కవాతు నిర్వహిస్తున్న ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి

నిర్మల్‌ఖిల్లా: శాసనసభ ఎన్నికల నేపథ్యంలో పౌరులు స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకునేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా ఎన్నికలు నిర్వహించే దిశగా కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నాటి నుంచి జిల్లాలో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎన్నికల ప్రవర్తన నియమావళికి అనుగుణంగా అడుగడుగునా తనిఖీలు నిర్వహిస్తున్నారు. జిల్లాలోని పోలీస్ సిబ్బందితోపాటు అదనంగా కేంద్ర, రాష్ట్ర బలగాలను సైతం రప్పిస్తున్నారు.

ప్రతీ నియోజకవర్గానికి..

జిల్లాలోని ప్రతీ నియోజకవర్గానికి సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్‌పీఎఫ్), రాపిడ్ యాక్షన్ ఫోర్స్ (ఆర్‌ఏఎఫ్), బీఎస్‌ఎఫ్ పారామిలటరీ దళాల సిబ్బందిని ఇప్పటికే కేటాయించింది. నియోజకవర్గ కేంద్రాల్లో వీరికి వసతి సౌకర్యాలను ఏర్పాటు చేసింది. ప్రజల మధ్యనే ఉంటూ ఎన్నికలు శాంతియుత వాతావరణంలో జరుగుతాయనే సంకేతాలను సాయుధ బలగాలు ప్రజల్లోకి పంపుతున్నాయి.

పోలింగ్ నాటికి మరింత సిబ్బంది

గతంతో పోల్చితే ఈసారి జిల్లాలో సాయుధ బలగాల మోహరింపు అధికంగానే ఉంటుందని అధికారవర్గాలు వెల్లడిస్తున్నాయి. ఇప్పటికే జిల్లాపోలీసులకు తోడు వివిధ బలగాలు జిల్లాకు చేరుకోగా పోలింగ్ తేదీ నవంబర్ 30 నాటికి ఈ సంఖ్య మరింత అధికమయ్యే అవకాశముందంటున్నారు.

సమస్యాత్మక కేంద్రాలపై నజర్..

శాంతిభద్రతల పరిరక్షణతోపాటు జిల్లాలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేయనున్నారు. ఈమేరకు సమస్యాత్మక ప్రాంతాలు, పోలింగ్ కేంద్రాలను అధికారులు ఇప్పటికే గుర్తించారు. ఆయా కేంద్రాల వద్ద ప్రత్యేక బలగాలను మోహరించనున్నారు. ఘర్షణ పూరిత వాతావరణం లేకుండా శాంతియుతంగా ఎన్నికల ప్రక్రియ పూర్తి చేసేందుకు అన్నిరకాల ఏర్పాట్లు చేస్తున్నారు.

చించోలి(బీ)లో నాకాబందీ

సారంగాపూర్: మండలంలోని చించోలి(బీ) గ్రామంలో ఆదివారం స్థానిక ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి ఆధ్వర్యంలో కేంద్ర సాయుధ బలగాలతో నాకాబందీ నిర్వహించారు. గ్రామ ప్రధాన రహదారుల్లో వాహనాల తనిఖీ చేపట్టారు. ఎన్నికల నేపథ్యంలో మద్యం, డబ్బుల అక్రమ రవాణాను అరికట్టేందుకే నాకాబందీ చేపట్టామని పేర్కొన్నారు. అనంతరం గ్రామంలో కవాతు నిర్వహించారు. ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ నిర్భయంగా ఓటు వేయాలని సూచించారు.

స్థానిక పోలీసులతో సమన్వయం

జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాలు, మండల కేంద్రాలు, సమస్యాత్మక ప్రాంతాలతోపాటు అన్ని రకాల ప్రాంతాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. సాయుధబలగాలు ఆయా నియోజకవర్గ కేంద్రాలు, మండల కేంద్రాల్లో కవాతు నిర్వహిస్తున్నాయి. జిల్లాలోని 650 మంది స్థానిక సిబ్బందితోపాటు అదనంగా వచ్చిన పారామిలటరీ దళాల పోలీసులు దాదాపు 200 మంది విధుల్లో నిమగ్నమయ్యారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో వజ్రాయుధం లాంటి ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకోవడం, స్వేచ్ఛాయుత పరిస్థితులు నెలకొల్పేలా గ్రామంలో వీరిపాత్ర కీలకం కానుంది. స్ట్రాంగ్ రూములతోపాటు తనిఖీ కేంద్రాల వద్ద భద్రత, వాహన తనిఖీలు తదితర విధుల్లో వీరు క్రియాశీలకమవుతున్నారు. ప్రత్యేక బెటాలియన్ బృందాలు ఇప్పటికే జిల్లాకు చేరుకున్నాయి. జిల్లా పోలీస్ అధికార యంత్రాంగం సూచనల మేరకు విధులు నిర్వర్తించనున్నారు. స్థానిక పోలీసులను సమన్వయం చేసుకుంటూ సేవలు అందిస్తారు. నామినేషన్ దాఖలు ప్రక్రియ మొదలయ్యాక వీరి విధులు మరింత విస్తృతం కానున్నాయి.

జిల్లాలో పోలింగ్ కేంద్రాలు ఇలా..

నిర్మల్, ఖానాపూర్, ముథోల్ నియోజకవర్గాల పరిధిలో 743 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో సాధారణ పోలింగ్ కేంద్రాలు-590, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు-136, మావోయిస్టు ప్రభావిత పోలింగ్ కేంద్రాలు- 17 ఉన్నట్లు గుర్తించారు. వీటిలో ఆయా ప్రాంతాలను బట్టి ఎలాంటి సమస్యలు లేకుండా శాంతియుత వాతావరణంలో పోలింగ్ ప్రక్రియ ముగిసేలా పోలీస్‌శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టనుంది.

బూటకపు మాటలతో వంచిస్తున్న కేసీఆర్

- డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు
- సారంగపూర్‌లో కాంగ్రెస్ సమావేశం



సారంగపూర్: మాట్లాడుతున్న శ్రీహరిరావు

సారంగపూర్: బూటకపు హామీలతో సీఎం కేసీఆర్ ప్రజలను వంచిస్తున్నారని డీసీసీ అధ్యక్షుడు, నిర్మల్ కాంగ్రెస్ అభ్యర్థి కూచాడి శ్రీహరిరావు ఆరోపించారు. ఆదివారం మండల కేంద్రం సమీపంలోని కరుణాకర్‌రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో పార్టీ కార్యకర్తలు, నాయకులతో నిర్వహించిన సమావేశానికి హాజరై మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం సారంగపూర్ మండలంలో ఒక్కరికీ డబుల్ బెడ్రూం ఇల్లు, దళిత బంధు ఇవ్వలేదని విమర్శించారు. బీఆర్‌ఎస్ కార్యకర్తలకే బీసీ బంధు ఇచ్చారని ఆరోపించారు. మంత్రిగా ఉన్న ఇంద్రకరణ్‌రెడ్డి నిర్మల్ నియోజకవర్గంలో తన స్వగ్రామంలో మాత్రమే డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించారని విమర్శించారు. ఇటీవలే కలెక్టర్ దళితబంధుపై కీలక ప్రకటన చేశారని పేర్కొన్నారు. నిర్మల్‌కు 100 దళితబంధు యూనిట్లు మాత్రమే వస్తాయని, అర్హులందరికీ ఎందుకు ఇవ్వడంలేదని ప్రశ్నించారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు తనను ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి, న్యాయవాది మల్లారెడ్డి, ఏఎంసీ మాజీ అధ్యక్షుడు దశరథ రాజేశ్వర్, ఎంపీటీసీ సభ్యుడు వెంకట్రమణారెడ్డి, నాయకులు అబ్దుల్ హాదీ, మారుతి, బొల్లోజి నర్సయ్య, భూమన్న తదితరులున్నారు.

జిల్లా కేంద్రంలో ఇంటింటా ప్రచారం

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని బుధవార్‌పేట్, బస్ డిపో, బోయివాడ కాలనీలో కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీహరిరావు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఆరు గ్యారంటీ పథకాల గురించి వివరిస్తూ ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా మామడ మండల బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి సామ వికాస్‌రెడ్డి, నాయకులు సాయికృష్ణ, సాయినాథ్, సోన్ మండలం న్యూబొప్పారం మాజీ సర్పంచ్ ఎండీ మౌలానా కాంగ్రెస్‌లో చేరారు. వీరికి శ్రీహరిరావు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

బీజేపీలో పలువురి చేరిక



పార్టీలో చేరినవారితో మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: బీజేపీలో పలువురు చేరగా ఆదివారం జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే, బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఏలేటి మహేశ్వర్‌రెడ్డి వారికి కండువాలు వేసి ఆహ్వానించారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణగౌడ్ సొంత గ్రామమైన కడ్తాల్‌కు చెందిన పలువురు గులాబీ పార్టీకి గుడ్‌బై చెప్పి మహేశ్వర్‌రెడ్డి సమక్షంలో కమలం గూటికి చేరారు. పార్టీలో చేరినవారిలో దిలావర్‌పూర్ మండలం కాల్వ గ్రామానికి చెందిన ఉపసర్పంచ్ కడ్తాల్ నర్సయ్య, వార్డు సభ్యులు సాయిరాం, సునీత, రాధిక, స్వామి, గణేశ్, వీడీసీ చైర్మన్ గట్టు నర్సయ్య, మాజీ చైర్మన్ లోలం రాజు, వివిధ కులసంఘాలు, యువజన సంఘాల సభ్యులున్నారు. ఈ సందర్భంగా మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. తొమ్మిదేళ్లలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి తన కుటుంబ ఆస్తులు పెంచుకున్నాడే గాని ప్రజలకు చేసిందేమీ లేదని ఆరోపించారు. ప్రజల్లో మార్పు మొదలైందని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో కేసీఆర్‌కు బుద్ధి చెప్పాలని, నిర్మల్‌లో కాషాయ జెండా ఎగురవేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గంగన్న, నాయకులు రాంనాథ్, రాజేశ్వర్‌రెడ్డి, రాజు, అంజుకుమార్‌రెడ్డి, అశోక్, హరీశ్‌రెడ్డి, దినేశ్, నారాయణ, రాము, మోహన్, సర్వేశ్వర్, నర్సయ్య, సత్యనారాయణ, రమణారెడ్డి, నర్సారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రమణయాదవ్, రాంరెడ్డి, నరేశ్, లక్ష్మణ్ తదితరులున్నారు.

అ'పూర్వ'ం.. ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనానికి హాజరైన పూర్వ విద్యార్థులు

లక్ష్మణచాంద: మండలంలోని పార్‌పెల్లి గ్రామంలోగల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 2003-2004 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివినవారంతా కార్యక్రమానికి హాజరయ్యారు. పాఠశాలలో చదివిన జ్ఞాపకాలు గుర్తు చేసుకుని రోజంతా సరదాగా గడిపారు. ఆత్మీయంగా పలకరించుకుని ఒకరి యోగక్షేమాలు ఒకరు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అప్పుడు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులు గోపాల్‌రావు, రమణయ్య, అనిల్‌కుమార్, శ్యాంసుందర్, కిరణ్, సంగీత, విజయ, స్వప్న, లావణ్య, నవీన్‌ను ఆహ్వానించి సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రాజేందర్‌యాదవ్, శ్రీనివాస్, లక్ష్మి, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే సమగ్ర అభివృద్ధి



పార్టీలో చేరినవారితో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

- మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి
- వివిధ సంఘాలతో సమావేశం

నిర్మల్‌టౌన్: బీఆర్‌తోనే సమగ్ర అభివృద్ధి సాధ్యమని రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం బేస్తవార్‌పేట్‌లో వంజర సంఘం, బ్రహ్మపురిలో కత్రి సంఘం, గెలాక్సీ ఫంక్షన్ హాల్‌లో మైనార్టీ నాయకులతో నిర్వహించిన సమావేశాల్లో మంత్రి పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కర్నాటకలోలాగా వ్యవసాయానికి 5గంటలే కరెంట్ ఇస్తారని విమర్శించారు. తెలంగాణలో 24గంటలు నిరంతర నాణ్యమైన విద్యుత్ ఇస్తున్నామని తెలిపారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి కేసీఆర్‌ను మూడోసారి సీఎంను చేయాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని చెప్పారు. అభివృద్ధిని చూసి తనను ఆశీర్వదించాలని కోరారు. సమావేశాల్లో మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, మాజీ చైర్మన్ గణేశ్, నాయకులు తిరుపతిరెడ్డి, రాంచందర్, ప్రభాకర్, రాము, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక

బీఆర్‌ఎస్‌లో పలువురు చేరగా జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి వారికి కండువాలు వేసి ఆహ్వానించారు. పార్టీలో చేరినవారిలో జిల్లా కేంద్రంలోని రాంనగర్‌కు చెందిన కైకాడి సంఘ సభ్యులు విశ్వనాథ్, శ్యామ్, సుభాష్, గోపి, ధరమ్, గంగ, టిప్పు సుల్తాన్ యూత్ సభ్యులు, షేక్ సాహెబ్‌పేట్‌కు చెందిన షకీల్ అహ్మద్ ఆధ్వర్యంలో పలువురు ఉన్నారు. నర్సాపూర్(జీ) మండల కేంద్రానికి చెందిన పలువురు గులాబీ తీర్థం పుచ్చుకున్నారు. ఇదే మండలం టెంబుర్ని గ్రామానికి చెందిన గైని భూమన్న, గాడి గంగారాం, బొగూడమీడి సాయన్న, అంబేద్కర్ యూత్ సభ్యులు, మైనార్టీ నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. సారంగపూర్ మండలం గోపాల్‌పేట్‌కు చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలతో పాటు మాజీ సర్పంచ్ గోపి శ్రీనివాస్ తదితరులు సర్పంచ్ సాయన్న ఆధ్వర్యంలో గులాబీ తీర్థం పుచ్చుకున్నారు. బీరవెల్లి గ్రామానికి చెందిన బరుకుంట లక్ష్మన్న, దయాకర్, సూర్యం, లక్ష్మణ్, రవి, మురళి, సతీశ్ తదితరులు బీఆర్‌ఎస్‌లో చేరారు. లక్ష్మణచాంద మండలం చామనపల్లికి చెందిన యాదవ సంఘం సభ్యులు బడుగరి నరేశ్, దోడ ముత్యం, గంగయ్య, శ్రీనివాస్ తదితరులు గులాబీ కండువా కప్పుకొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, మాజీ చైర్మన్ గణేశ్, నాయకులు మురళీధర్‌రెడ్డి, రాంచందర్, తిరుపతిరెడ్డి, గౌతమ్‌రెడ్డి, ప్రభాకర్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కాలినడకన అమ్మవారి దర్శనం



బాసరకు వచ్చిన వృద్ధుడు

భైంసా: మహారాష్ట్రలోని పర్బని జిల్లాకు చెందిన కిసాన్‌రావు అనే భక్తుడు కాలినడకన బాసరకు చేరుకుని ఆదివారం సరస్వతీ అమ్మవారిని దర్శించుకున్నాడు. వృద్ధాప్యంలోనూ విచిత్ర వేషధారణతో అంతదూరం నుంచి బాసర అమ్మవారి దర్శనానికి రావడంతో స్థానికులు, భక్తులు ఆశ్చర్యానికి గురయ్యారు. స్థానికులు అతన్ని పలకరించగా సరస్వతీ అమ్మవారి దర్శనం కోసం వచ్చానని, ఏ పుణ్యక్షేత్రానికైనా ఇలాగే వెళ్తానని చెప్పాడు. తాను శ్రీరాముని సేవకుడినని, చేతిలో కాషాయ జెండా, డమరుకం మోగిస్తూ శ్రీరాముని జపం చేయడం ఆనందాన్ని ఇస్తుందన్నాడు.

ఓసీ సంఘాల అధ్యక్షుడిగా సంతోష్



జనగాం సంతోష్

ఆదిలాబాద్‌టౌన్: ఓసీ సంఘాల ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా ఆదిలాబాద్ పట్టణానికి చెందిన జనగాం సంతోష్ ఎన్నికయ్యారు. ఈమేరకు ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు కరుణాకర్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. రెండేళ్లుగా సంతోష్ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ఆయన సేవలను గుర్తించి ఉమ్మడి జిల్లా బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

మద్యం పట్టివేత



పట్టుకున్న మద్యంతో పోలీసులు

నర్సాపూర్(జి): మండలంలోని చాక్‌పల్లిలో ఆదివారం పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో అడ్డిగ భోజన్న ఇంట్లో 11 లీటర్ల మద్యం పట్టుకున్నట్లు ఎస్సై రవీందర్ పేర్కొన్నారు. మద్యం విలువ రూ.5,140 ఉంటుందని, కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.


రూ.13 లక్షల నగదు పట్టివేత

భైంసా(ముధోల్): బాసర గోదావరి బ్రిడ్జి వద్ద ఆదివారం రూ.13 లక్షల నగదు పట్టుకున్నట్లు ఎస్సై గణేశ్ తెలిపారు. గోదావరి బ్రిడ్జి వద్ద ఫారెస్ట్ చెక్‌పోస్ట్ సమీపంలో తనిఖీలు నిర్వహిస్తుండగా మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా నాయకాకు చెందిన బాలాజీ మేడేవార్ వద్ద నగదు పట్టుబడింది. ఇందుకు సంబంధించి ఎలాంటి పత్రాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మహిళ మెడలోంచి గొలుసు అపహరణ

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని కైలాస్‌నగర్‌కు చెందిన మౌర్య గోదావరి మెడలో నుంచి రెండు తులాల బంగారు గొలుసును గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు అపహరించినట్లు ఎస్సై విష్ణు వర్ధన్ తెలిపారు. కైలాస్‌నగర్‌కు చెందిన గోదావరి ఆదివారం ఇంటి ఎదుట ఫోన్‌లో మాట్లాడుతుండగా ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు వ్యక్తులు ఆమె మెడలో నుంచి బంగారు గొలుసును అపహరించుకుని వెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

3,48,736



పోలింగ్ శాతంపై ప్రభావం

- ఉమ్మడి జిల్లాలో పోలింగ్‌కు దూరం
- ఓటింగ్‌పై అనాసక్తి

భైంసాటౌన్ (ముధోల్): 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ భారత రాజ్యాంగం ఓటుహక్కు కల్పించింది. ఎందుకంటే ప్రజాస్వామ్య దేశంలో ప్రజల చేత ఎన్నుకోబడినవారే నాయకులు. ఇలా ఎన్నుకోబడినవారు ప్రజారంజక పాలన చేయకపోతే తిరిగి సమర్థుడైన నాయకుడిని ఎన్నుకోవాలనే ఉద్దేశంతో ఎన్నికల సంఘం ఐదేళ్లకోసారి ఎన్నికలు నిర్వహిస్తోంది. ఎంతో వ్యయప్రయాసలకోర్చి ఈ ప్రక్రియ నిర్వహిస్తుండగా చాలామంది పోలింగ్‌రోజును సెలవుదినంగా భావించి ఇళ్లకు, వ్యక్తిగత పనులకు పరిమితమవుతున్నారు. మనప్రాంత అభివృద్ధిపై నిలదీయాలంటే ముందుగా ఓటు వేయాలి. ఓటు వేయకపోతే ప్రశ్నించే హక్కు కోల్పోయినట్లే. నవంబర్ 30న పోలింగ్ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా ఓటుహక్కు వినియోగించుకోవాల్సిన అవసరం ఉంది.

గత అసెంబ్లీ ఎన్నికలు పరిశీలిస్తే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో దాదాపు 3.5 లక్షల మంది పోలింగ్‌కు దూరంగా ఉన్నారు. అంటే సుమారుగా రెండు చిన్న నియోజకవర్గాల్లోని ఓటర్ల సంఖ్యకు సమానంగా ఓటుహక్కు వినియోగించుకోలేదంటే అతిశయోక్తి కాదు. ఓటు వేయడంపై ఇప్పటికీ చాలామంది ఆసక్తి చూపడం లేదు. పోలింగ్ కేంద్రాల్లో గంటల తరబడి క్యూలో నిల్చోవడం, పోలింగ్‌రోజున ఇతర ప్రాంతాలకు వెళ్లడం, వ్యక్తిగత పనులకు ప్రాధాన్యం ఇవ్వడం, మారుమూల గ్రామాలు, రోడ్డు సౌకర్యం లేని ప్రాంతాల్లో పోలింగ్ శాతంపై ప్రభావం చూపుతోంది.

పోలింగ్ శాతం పెంచేందుకు...

ఈసారి పోలింగ్ శాతం పెంచేందుకు ఎన్నికల సంఘం అన్ని చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా దివ్యాంగులు, వృద్ధులు ఇంటి నుంచే ఓటుహక్కు వినియోగించుకునే అవకాశం కల్పించింది. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు గంటల తరబడి క్యూలో నిల్చునే ప్రయాస తగ్గించేలా కొత్త పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. అధిక సంఖ్యలో ఓటర్లు ఉన్న కేంద్రాల్లో అదనపు కేంద్రాలు ఏర్పాటు చేశారు.

శాసనసభ ఎన్నికలు నవంబర్‌లో రెండోసారి

మంచిర్యాలటౌన్: రాష్ట్ర శాసనసభకు నవంబర్ 30న జరగనున్న ఎన్నికలు ఇదేమాసంలో రెండోసారిగా గుర్తింపు పొందనున్నాయి. దాదాపు మూడు దశాబ్దాల తర్వాత నవంబర్ నెలలో రాష్ట్ర శాసనసభకు ఎన్నికలు జరగనున్నాయి. 1952లో దేశంలో మొట్టమొదటిసారిగా రాష్ట్రాలకు ఎన్నికలు జరిగాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 1989 నవంబర్ 22 న ఎన్నికలు నిర్వహించారు. రాష్ట్రంలో జరిగిన పలు ఉప ఎన్నికలను మినహాయిస్తే, రాష్ట్ర అసెంబ్లీకి 34 ఏళ్ల తర్వాత నవంబర్‌లో అంటే 2023 నవంబర్ 30న ఎన్నికలు జరగడం రెండోసారి.

ఎన్నికలు జరిగిన తేదీలు

సంవత్సరం	నెల	తేదీ
1952	–	–
1957	ఫిబ్రవరి	25
1962	ఫిబ్రవరి	08
1972	మార్చి	15
1978	ఫిబ్రవరి	25
1983	మే	01
1985	మే	03
1989	నవంబర్	22
1994	డిసెంబర్	01
1999	సెప్టెంబర్	18
2004	ఏప్రిల్	20
2009	ఏప్రిల్	16
2014	ఏప్రిల్	30
2018	డిసెంబర్	07

ఆసిఫాబాద్‌ను ఏలిన ఆ నలుగురు..

- ఆసిఫాబాద్ ఎమ్మెల్యేలుగా గెలిచిన బెల్లంపల్లి నాయకులు
- మూడుసార్లు గెలిచి హ్యాట్రిక్ సాధించిన గుండా మల్లేశ్
- రెండుసార్లు విజయం సాధించిన దాసరి నర్సయ్య
- ఒక్కోసారి గెలిచిన పాటి సుభద్ర, అమురాజుల శ్రీదేవి



పాటి సుభద్ర



అమురాజుల శ్రీదేవి



దాసరి నర్సయ్య



గుండా మల్లేశ్

ఉమ్మడి ఆసిఫాబాద్ ఎస్సీ అసెంబ్లీ నియోజకవర్గాన్ని బెల్లంపల్లికి చెందిన నలుగురు రాజకీయ నాయకులు వరుసగా 33ఏళ్లు ఏలారు. నలుగురూ కలిసి మొత్తంగా ఏడు పర్యాయాలు ఎమ్మెల్యేలుగా గెలిచి సత్తా చాటారు. బెల్లంపల్లి ప్రాంత వాస్తవ్యులైన దాసరి నర్సయ్య (కాంగ్రెస్), గుండా మల్లేశ్ (సీపీఐ), పాటి సుభద్ర, అమురాజుల శ్రీదేవి (టీడీపీ)కి నియోజకవర్గ ప్రజలు పట్టం కట్టి ఆదరించారు.

బెల్లంపల్లి: 1952 జనరల్ ఎన్నికలతో పాత ఆసిఫాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ఏర్పాటైంది. ఈ నియోజకవర్గం పరిధిలో ఆసిఫాబాద్, వాంకిడి, రెబ్బెన, తిర్యాణి, తాండూర్, భీమిని మండలాలతో పాటు పారిశ్రామిక క్షేత్రం బెల్లంపల్లి ప్రధాన పట్టణంగా ఉండేది. 2009లో నియోజకవర్గాల పునర్విభజనలో బెల్లంపల్లి కొత్త అసెంబ్లీ నియోజకవర్గంగా ఏర్పడింది. అప్పటి వరకు ఉమ్మడి ఆసిఫాబాద్ నియోజకవర్గానికి 12 సార్లు ఎన్నికలు జరిగాయి. ఇందులో 1952లో తొలిసారి జరిగిన ఎన్నికల్లో కొండా లక్ష్మణ్ బాపూజీ (కాంగ్రెస్), 1957లో జరిగిన మలి విడత ఎన్నికల్లో జి.నారాయణరెడ్డి (కాంగ్రెస్) విజయం సాధించారు. ఆ తర్వాత 1962లో జరిగిన ఎన్నికల్లో ఆసిఫాబాద్ నియోజకవర్గాన్ని ఎస్టీలకు రిజర్వు చేశారు. ఆ తదుపరి 1967, 1972 ఎన్నికల వరకు ఎస్టీ అభ్యర్థులకు పోటీ చేసే అవకాశం దక్కింది. వరుసగా ఆ మూడు ఎన్నికల్లోనూ గిరిజన నాయకుడు కొట్నాక భీంరావు (కాంగ్రెస్) ఎమ్మెల్యేగా ఎన్నికై రాజకీయ ఆధిపత్యాన్ని చాటుకున్నారు.

1978లో ఎస్సీ రిజర్వుడ్..

ఉమ్మడి ఆసిఫాబాద్ నియోజకవర్గాన్ని 1978లో ఎస్సీలకు రిజర్వు చేశారు. అంతకు ముందు వరకు ఆసిఫాబాద్ ప్రాంత నాయకులు ఎమ్మెల్యేగా ఎన్నిక కాగా బెల్లంపల్లి ప్రాంత నాయకులకు ఆ భాగ్యం కలుగలేదు. ఎస్సీలకు రిజర్వు చేసినప్పటి నుంచి బెల్లంపల్లి రాజకీయ నాయకుల దశ మారింది. వరుసగా 1978, 1983, 1985 (ఉప ఎన్నికలు), 1989, 1994, 1999, 2004లో జరిగిన సాధారణ ఎన్నికల్లో బెల్లంపల్లి వాస్తవ్యులైన కాంగ్రెస్, సీపీఐ, టీడీపీ నాయకులు ఎమ్మెల్యేలుగా విజయం సాధించి ఆసిఫాబాద్‌పై పట్టు బిగించారు.

హ్యాట్రిక్ సాధించిన గుండా మల్లేశ్..

ఎస్సీలకు రిజర్వు చేసిన తర్వాత ఆసిఫాబాద్ నియోజకవర్గంపై బెల్లంపల్లి ప్రాంత రాజకీయ నాయకులకు ఎదురులేకుండా పోయింది. 1978 ఎన్నికల నుంచి 2004 ఎన్నికల వరకు బెల్లంపల్లి నేతలే వరుసగా ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. 1978లో జరిగిన ఎన్నికల్లో దాసరి నర్సయ్య (కాంగ్రెస్), 1983లో జరిగిన ఎన్నికల్లో గుండా మల్లేశ్ (సీపీఐ), 1985లో జరిగిన ఉప ఎన్నికల్లోనూ గుండా మల్లేశ్ ఘన విజయం సాధించారు. 1989లో జరిగిన సాధారణ ఎన్నికల్లో రెండోసారి దాసరి నర్సయ్య, 1994లో జరిగిన ఎన్నికల్లో గుండా మల్లేశ్ మూడోసారి గెలుపొంది హ్యాట్రిక్ సాధించారు. 1999లో జరిగిన ఎన్నికల్లో డాక్టర్ పాటి సుభద్ర (టీడీపీ) విజయ బావుటా ఎగురవేసి తొలి మహిళా ఎమ్మెల్యేగా ఖ్యాతి గడించారు. 2004లో జరిగిన ఎన్నికల్లో అమురాజుల శ్రీదేవి (టీడీపీ) విజయం సాధించారు. ఆసిఫాబాద్ నియోజకవర్గం నుంచి మూడు దఫాలు ఎమ్మెల్యేగా గెలిచి గుండా మల్లేశ్ రికార్డు సృష్టించారు. రెండుసార్లు దాసరి నర్సయ్య, పాటి సుభద్ర, అమురాజుల శ్రీదేవి ఒక్కోసారి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించారు. 2009లో ఏర్పడిన బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీచేసిన గుండా మల్లేశ్ విజయం సాధించి తొలి ఎమ్మెల్యేగా గుర్తింపు పొందారు. ఆసిఫాబాద్, బెల్లంపల్లి నియోజకవర్గాల్లో మొత్తంగా నాలుగు సార్లు గుండా మల్లేశ్ విజయం సాధించారు.

ఎమ్మెల్యేలుగా ఎన్నికైన బెల్లంపల్లి నేతల వివరాలు

సంవత్సరం	ఎన్నికైన నేత	రాజకీయపార్టీ
1978	దాసరి నర్సయ్య	కాంగ్రెస్
1983	గుండా మల్లేశ్	సీపీఐ
1985	గుండా మల్లేశ్	సీపీఐ
1989	దాసరి నర్సయ్య	కాంగ్రెస్
1994	గుండా మల్లేశ్	సీపీఐ
1999	పాటి సుభద్ర	టీడీపీ
2004	అమురాజులశ్రీదేవి	టీడీపీ

విద్యార్థిని మృతిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపిస్తాం



బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎస్పీ

- ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

ఉట్నూర్‌రూరల్(ఖానాపూర్): గిరిజన విద్యార్థిని అనుమానాస్పద మృతిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి నిందితులను పట్టుకుంటామని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం రాత్రి దొంగచింత పంచాయతీ పరిధిలోని భీంజీగూడకు చెందిన ఆదివాసీ విద్యార్థిని అనుమానాస్పదంగా మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎస్పీ ఆదివారం ఉట్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం గ్రామస్తులు, కుటుంబ సభ్యులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థిని మృతిపై ఉట్నూర్ డీఎస్పీ ఆధ్వర్యంలో సీఐ, ఎస్సై, ఇంటలిజెన్స్ పోలీసులందరితో కలిసి విచారణ జరిపిస్తామన్నారు. ఇందుకు బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పూర్తి సహాయ సహకారాలు అందించాలన్నారు. ఎస్పీ వెంట డీఎస్పీ నాగేందర్, సీఐ రామకృష్ణ, ఎస్సై మనోహర్, సిబ్బంది ఉన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

రాయిసెంటర్ జిల్లా మేడి మెస్రం దుర్గు, ఆదివాసీ సంఘాల నాయకులు పుర్క బాపురావు, పెందూర్ ప్రభాకర్ మృతదేహాన్ని పరిశీలించారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

అగ్నికి ఆహుతవుతున్న హరితహారం మొక్కలు

సోన్: మండలంలోని న్యూవెల్మల్, పాక్‌పట్ల, బొప్పారం గ్రామాల్లో రహదారికి ఆనుకుని ఉన్న హరితహారం మొక్కలు ఆదివారం అగ్నికి ఆహుతయ్యాయి. రైతులు రహదారిపై మొక్కజొన్న పంటలను ఆరబెట్టి వ్యర్థాలను రోడ్డుకు ఇరువైపులా వదిలేయడంతో గుర్తు తెలియని వ్యక్తులు వాటికి నిప్పంటిస్తున్నారు. దీంతో వ్యర్థాలతో పాటు హరితహారం మొక్కలు కాలిపోతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి హరితహారం మొక్కలను కాపాడాలని పలువురు కోరుతున్నారు.



మోసగించిన వ్యక్తిపై కేసు

ఆదిలాబాద్‌రూరల్: యజమానికి తెలియకుండా బ్యాంక్ అకౌంట్ నుంచి చెక్కుల ద్వారా నగదు ట్రాన్స్‌ఫర్ చేయించుకుని మోసగించిన ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలోని ఓల్డ్ హౌజింగ్ బోర్డు కాలనీకి చెందిన ప్రణేష్ మావలలోని శ్రీ వినాయక ఫిల్లింగ్ స్టేషన్‌లో ఫిబ్రవరి నుంచి మేనేజర్‌గా పనిచేస్తున్నారు. పెట్రోల్ పంపులో డీజిల్, పెట్రోల్ ఆవిరి అవుతుందని రూ.11 లక్షల నష్టం చూపించారు. అనుమానం వచ్చిన యాజమాని సొందర్‌పెల్లి శ్రీకర్ అతన్ని ఇటీవల విధుల నుంచి తొలగించారు. సంతకాలు చేసి ఉన్న ఆరు చెక్కులతో పాటు పెట్రోల్ పంపునకు సంబంధించిన లైసెన్స్, ఇతర విలువైన పత్రాలను యాజమానికి తెలియకుండా తీసుకెళ్లాడు. ఈ నెల 24న ప్రణేష్ ఖాతాలోకి రూ.35 లక్షలు ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నారు. పెట్రోల్ బంక్ యాజమాని శ్రీకర్ ఫిర్యాదు మేరకు ప్రణేష్‌పై కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

తొమ్మిది మందిపై డ్రంకెన్ డ్రైవ్ కేసు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని మంచిర్యాల చౌరస్తాలో ఆదివారం మద్యం సేవించి వాహనం నడిపిన తొమ్మిది మందిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ట్రాఫిక్ ఎస్సై దేవేందర్ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపి, ప్రమాదాలకు కారణం కావద్దని ఆయన సూచించారు.

తీసుకున్న అడ్వాన్స్ చెల్లించాలని ఆందోళన



నిరసన తెలుపుతున్న బాధిత కుటుంబం

జైపూర్: రైస్ మిల్లు విక్రయిస్తానని తీసుకున్న అడ్వాన్స్ చెల్లించాలని మిల్లు యజమాని ఇంటి ఎదుట బాధిత కుటుంబం ఆందోళనకు దిగింది. జైపూర్ మండలం టేకుమట్ల గ్రామానికి చెందిన గుల్లపల్లి రాధ–సూర్యనారాయణ ఇదే గ్రామంలోని మహాలక్ష్మి రైస్‌మిల్లు విక్రయిస్తానని మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేటకు చెందిన తోట వినోద్ వద్ద నుంచి రూ.39లక్షలు అడ్వాన్స్‌గా తీసుకున్నాడు. మిల్లును ఇతరులకు విక్రయించడంతో పాటు తీసుకున్న అడ్వాన్స్ చెల్లించకపోవడంతో బాధిత కుటుంబం ఆదివారం సూర్యనారాయణ ఇంటిఎదుట ఆందోళనకు దిగింది. తమ డబ్బులను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు.

గుడుంబా స్థావరాలపై దాడులు

నెన్నెల: మండలంలోని గ్రావణ్‌పల్లిలో గుడుంబా స్థావరాలపై ఆదివారం పోలీసులు దాడులు నిర్వహించినట్లు ఎస్సై శ్యాంపటేల్ తెలిపారు. ఈ దాడుల్లో 25 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని మామిడి తోటల్లో పాతిపెట్టిన 200 లీటర్ల బెల్లంపానకం ధ్వంసం చేసినట్లు ఆయన పేర్కొన్నారు. గ్రామానికి చెందిన దేగరి వెంకటేశ్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అదృశ్యమైన వ్యక్తి మృతి

లక్సెట్టిపేట(మంచిర్యాల): మండలంలోని వెంకట్రావుపేటలో ఈ నెల 24న అదృశ్యమైన వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై లక్ష్మణ్ తెలిపారు. గ్రామానికి చెందిన బీరయ్య (38) కొంతకాలంగా మానసిక వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ నెల 24న ఇంటినుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. ఆదివారం చెల్లంపేట గ్రామ శివారులో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

కుక్క కాటుతో బాలుడికి గాయాలు



గాయాలపాలైన బాలుడు

బెజ్జూర్: మండలంలోని సులుగుపల్లి గ్రామానికి చెందిన ఆత్రం ఆదిత్య అనే బాలుడిని కుక్క కాటువేసింది. ఆదివారం ఉదయం బాలుడు తన ఇంటి బయట ఆడుకుంటుండగా కాలు, వెన్నుపై కరవడంతో గాయాలయ్యాయి. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

అభయారణ్యంలో అందమైన భవనం

- ప్రారంభానికి ముస్తాబైన వాచ్‌టవర్



ముస్తాబైన వాచ్‌టవర్

వేమనపల్లి: కలప అక్రమ రవాణా నివారణ, వన్యప్రాణుల సంరక్షణకోసం అటవీశాఖ అడవిలో వాచ్‌టవర్ల నిర్మాణానికి చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా జిల్లాలోని మంచిర్యాల, జైపూర్, బెల్లంపల్లి, కుశ్నపల్లి రేంజ్, వేమనపల్లి సెక్షన్‌లోని అటవీ ప్రాంతాల్లో వాచ్‌టవర్ నిర్మాణం పూర్తి అయ్యింది. సుమారు రూ.12 లక్షల నిధులతో మూడు అంతస్తుల భవనాన్ని నిర్మించారు. రెండు రోజుల్లో కాళేశ్వరం ఎఫ్‌డీపీటీ, సీఎఫ్ వినోద్‌కుమార్, డీఎఫ్‌ఓ ఆశిష్‌సింగ్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేసేందుకు సిద్ధం చేస్తున్నారు. రేంజ్ అధికారి గోవింద్‌చంద్ సర్దార్ ఆధ్వర్యంలో భవనానికి రంగుల అద్దకం, వైరింగ్ పనులు పూర్తి చేశారు. ఆకుపచ్చని అడవిలో అదే రంగుతో వన్యజీవుల చిత్రాలతో ముస్తాబు చేస్తున్నారు.

మూడు వైపులా దారులు

టైగర్ రిజర్వు ప్రాంతం కావడంతో ఇప్పటికే మూడు వైపులా రోడ్లు నిర్మించారు. అవసరం ఉన్న చోట ఒర్రెలపై లోలెవల్ వంతెలను నిర్మించారు. టవర్ వద్దకు వెళ్లేందుకు వేమనపల్లి నుంచి రాజారాం మీదుగా ప్రత్యేక రోడ్డు ఏర్పాటు చేశారు. కొమురంభీం జిల్లా గిరివెల్లి అటవీ ప్రాంతం వైపు నుంచి, నాగారాం లోత్వాడ్రే ఆర్‌అండ్‌బీ రోడ్డు వరకు రోడ్లు వేశారు. వాచ్‌టవర్‌కు 10 కిలోమీటర్ల దూరం నుంచి మూడు వైపులా రోడ్లు పూర్తి అయ్యాయి. ఏ సమయంలోనైనా ఉన్నతాధికారులతో పాటు స్థానిక సిబ్బంది టవర్ వద్దకు వెళ్లేందుకు దారులు సిద్ధం చేశారు. అవసరమైతే టవర్ వద్దే రాత్రిపూట బస చేసేందుకు ఏర్పాట్లు సిద్ధం చేశారు.

జగన్మాతా.. దీవించు!

- జంగుబాయికి ఎంపీ 'సోయం' పూజలు



రావుడ్ దేవతకు మొక్కుతున్న ఎంపీ

కెరమెరి(ఆసిఫాబాద్): మండలంలోని తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దులోని మహరాజ్‌గూడ అడవుల్లో కొలువైన ఆదివాసీల ఆరాధ్య దేవత జంగుబాయిని ఆదివారం ఎంపీ సోయం బాపూరావు దర్శించుకున్నారు. సిద్దిసక, టోప్లకస, రావుడ్ దేవతలకు, ప్రత్యేక పూజలు చేశారు. మైసమ్మ, పోచమ్మ తల్లికి మొక్కుకున్నారు. ఏటా దసర పర్వదినం తర్వాత అమ్మవారిని దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. బోథ్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థిగా అధిష్టానం తన పేరు ఖరారు చేసిందని, విజయం వరించేలా చూడాలని జంగుబాయిని వేడుకున్నట్లు ఎంపీ తెలిపారు.

'కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు గుణపాఠం చెప్పాలి'

మందమర్రిరూరల్: ముస్లింలకు ఇచ్చిన హామీలను విస్మరించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని ముస్లిం జాక్ రాష్ట్ర కోఆర్డినేటర్ యూసుఫ్‌బాబా అన్నారు. ఆదివారం పట్టణంలోని మంజునాథ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ముస్లిం డిక్లరేషన్ సదస్సుకు హాజరై మాట్లాడారు. తెలంగాణలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్ కల్పించలేదని మండిపడ్డారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కూడా మోసం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ముస్లింలకు 22 డిమాండ్ల డిక్లరేషన్ అమలు చేసే పార్టీని గెలిపించుకోవాలనే ఉద్దేశంతో సదస్సు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సదస్సు కన్వీనర్ ఇబ్రహీం పాల్గొన్నారు.